456 మంది ఓటేశారు

ఇంటి నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు



ఓటరు ఇంటికి వెళ్లి వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి పులి సైదులు

దుండిగల్: ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు నేరుగా ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 290 మంది వృద్ధులు, 166 దివ్యాంగులు మొత్తం 456 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తమ సిబ్బంది ఓటర్ల ఇంటికి వెళ్లి నేరుగా ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు.

కొంత మంది 'నోటా' మాట!

దుండిగల్: మీ పార్టీ వోళ్లు మమ్మల్ని పిలుస్తలేరు.. ప్రచారంలో తిప్పలేరు.. డబ్బులు ఇస్తలేరు.. ఎలక్షన్లలోపు ఓటుకు పైసలు ఇస్తనే మీ నాయకుడికి ఓటు వేస్తం.. ఇయ్యకపోతే వేరే పార్టీకి కూడా వేయ్యం.. సక్కగ పోయి నోటాకు గుద్దుతం.. అంటూ మాస్ పబ్లిక్ బహిరంగంగానే ద్వితీయ శ్రేణి నాయకులను హెచ్చరిస్తున్నారు. కొంత మంది నాయకులే తమ అధినాయకుడి నుంచి డబ్బులు తెచ్చుకుని కార్యకర్తలు, మహిళలకు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో ఇలాంటి విషయాలే వెలుగులోకి వస్తున్నాయి.

◆ దీంతో చేసేదేమి లేక చోటా.. మోటా నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి రోజు ఒక్కో మహిళకు ప్రచారం కోసం రూ.500 ఆ పార్టీ నాయకులు చెల్లిస్తున్నారు. మురికివాడ ప్రాంతాల్లోని పలు బస్తీల్లోని మహిళలు, కార్యకర్తలు ఒకే నాయకుడిని నమ్ముకుని ఉంటున్నారు. అతనికి పార్టీ నుంచి సరైన గుర్తింపు, డబ్బు రావడం లేదు. దీంతో సదరు మహిళలు ఇతర పార్టీలకు వెళ్లి ప్రచారంలో పాల్గొనలేక.. ఇటు నమ్ముకున్న నాయకుడు తమకు గండి (రోజుకు రూ.500) కొడుతున్నాడని అన్నారు. ప్రతి రోజు అతని ఇంటికి వచ్చి శాపనార్థాలు పెడుతున్నారు. దీంతో చేసేదేమి లేక అతను మిన్నకుండి వారి తిట్ల దండకాన్ని ఆలకిస్తున్నాడు.

పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి పులి సైదులు

దుండిగల్: ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. లయోల జూనియర్ కళాశాలలో ఈవీఎంల కమిషనింగ్‌ను ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో నిర్వహించారు. ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసిన్నట్లు ఆయన తెలిపారు.

ఆర్ట్‌గ్యాలరీలో ఇండియన్ ఫొటో ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 40 దేశాల నుంచి 2500 మంది ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. జనవరి 7 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు స్నాతకోత్సవం

నిజాంపేట్: బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం 29వ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ రాజాబాబు, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్ విశాల్ గుప్తా, విజ్ఞాన జ్యోతి ప్రెసిడెంట్ డి.సురేష్‌బాబు, చైర్మన్ హరిశ్చంద్రప్రసాద్, జనరల్ సెక్రటరీ శేషగిరిరావు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

నేటి నుంచి శిల్పారామంలో ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామం ఆంఫీ థియేటర్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు భరతవేద ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దేంద్ర యోగి ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించనున్నారు. గురు వు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందం పాల్గొనుంది.

ముసురు వర్షం



సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్‌లో గురువారం తేలికపాటి వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9:30 గంటల వరకు నల్లటి మబ్బులు కూడుకున్నాయి. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అక్కడక్కడ తేలిక పాటు వర్షం కురిసింది. దీంతో వాహనదారులు, పాదచారులు వర్షంలో తడిసి ముద్దయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తీవ్రంగా గాయపడిన బాలుడు



మృతి చెందిన తుషార్



ఆస్పత్రిలో నవనాథ్

జీడిమెట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌కు చెందిన బలరాం కుమారుడు నవనాథ్(17), సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన రవి కుమారుడు తుషార్(18)లు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు 22వ తేదీన స్నేహితుడి పుట్టినరోజు ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. గురువారం ఉదయం 4గంటలకు తుషార్ ద్విచక్రవాహనం (టీఎస్13ఈజీ 0351) నడుపుతుండగా నవనాత్ వెనుక కూర్చున్నాడు. ఇద్దరు కలిసి షాపూర్‌నగర్ నుంచి అతివేగంగా బాలానగర్ వైపు వెళ్తున్నారు. వీరు చింతల్ రిడ్జ్ టవర్ వద్దకు చేరుకోగానే అక్కడే యూటర్న్ తీసుకుంటున్న కారు(టీఎస్28ఎస్0613)కు బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో తుషార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తుషార్ అక్కడికి అక్కడే మృతిచెందగా నవనాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే నవనాథ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి తుషార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నవనాథ్ తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపర భగీరథుడు సీఎం కేసీఆర్

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్



వివేకానంద్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న బాలయ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నగేశ్



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వివేకానంద్



దుండిగల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఎన్నో ప్రాజెక్ట్‌లను నిర్మించి బీడు మారిన భూములను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని స్థానిక ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ షాపూర్‌నగర్ రైతు బజార్ వద్ద వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నాయకులు మధుమోహన్, సిద్ధిఖ్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మహిళలు బోనాలతో వివేకానంద్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వందలాది మంది కార్యకర్తలతో పలు వార్డుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ సూరారంలోని భీమా గార్డెన్స్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ అధ్వర్యంలో నిర్వహించిన కుత్బుల్లాపూర్ గార్మెంట్స్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమానికి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి, నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి అంజి యాదవ్, సభ్యులు గౌరీ శంకర్, ఆర్. లక్ష్మణ్, ఎల్. రామకృష్ణ, ఎం. భీమ శేఖర్, చారి, దుర్గ, శ్రీనివాస్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ రజక సంఘం అధ్యక్షుడు సింగారం మల్లేష్ అధ్వర్యంలో రజరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, ఆంజనేయులు, బాలయ్య, బాచుపల్లి వెంకటేష్, పురుషోత్తం, నర్సయ్య, యాదగిరి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్ఆర్ నాయక్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రంగారావు, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, వెంకటరత్నం, అశోక్, ప్రసాద్, ఆర్య వైశ్య సంఘం సభ్యులు, పి. నవీన్ కుమార్, శ్రీనివాస్, ఎస్. రామకృష్ణ, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ సారెగుడెం, డి.పోచంపల్లి, 9వ వార్డు, 12వ వార్డు, రాజు కాలనీ, 10వ వార్డు, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ సూరారం డివిజన్ షాపూర్ నగర్ రైతు బజార్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో హజ్రత్ జిందా షా మదర్ ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ఆవిష్కరించారు.



కుత్బుల్లాపూర్ గార్మెంట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్



గజమాలతో సత్కరిస్తున్న రజక సంఘం నేతలు



షాపూర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో ప్రచారం



ఉర్సు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివేకానంద్

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ఉండి తమ అభ్యర్థులను గెలిపించాలని.. అప్పుడే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి పిలుపునిచ్చారు. విడిపోతే పడిపోతాం ఐక్యంగా ఉంటే బీసీలదే విజయమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లు, పార్టీ శ్రేణులకు విన్నవించారు. వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న హామీలు వాగ్దానాలకు మోసపోకుండా బీసీలు ఐక్యంగా ఉండి సంఘటిత శక్తిని ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలకు మోసపోతే మళ్లీ ఐదు సంవత్సరాలు అభివృద్ధి వెనక్కి పోతుందని స్పష్టం చేశారు. ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే బీసీ అభ్యర్థులను చట్ట సభల్లోకి పంపిస్తే తమ వాణిని వినిపిస్తారని తెలిపారు.





కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించాలి

• గోరఖ్‌పూర్ ఎంపీ రవికిషన్ • ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన





కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి వేలాది కోట్ల అభివృద్ధి నిధులు కేటాయించిందని... రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బంగారు తెలంగాణను సాధిస్తామని గోరఖ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రవికిషన్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ పరిధి ఎన్ఎల్‌బీనగర్, వివేకానందనగర్, శ్రీనివాస్‌నగర్, రోడామేస్త్రీనగర్, వల్లభాయ్‌పటేల్‌నగర్‌లలో బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు.

◆ ఈ సందర్భంగా రవికిషన్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కురుకుపోయిందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే పుట్టే బిడ్డపై సైతం అప్పుల భారం తప్పదన్నారు. కమలం గుర్తుపై ఓటేసి ప్రజల కోసం నిత్యం పరితపించే శ్రీశైలంగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

◆ అనంతరం కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మరిన్ని బస్తీ దావాఖానాలను ఏర్పాటు చేయిస్తానన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

◆ ప్రముఖ పారిశ్రామిక వేత్త, కాకతీయ డైనస్టీ అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాస్‌ను బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై పొట్లూరి శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు మాధవి, సుమన్‌రావు, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో బీజేపీ కూన శ్రీశైలంగౌడ్‌కు హారతుదు పడుతున్న మహిళలు




పారిశ్రామికవేత్త పొట్లూరి శ్రీనివాస్‌ను మద్దతు కోరుతూ..



గాంధీనగర్‌లో ప్రచారానికి వచ్చిన శ్రీశైలంగౌడ్‌కు హారతి పడుతూ..

బీజేపీని గెలిపిస్తే బీసీ బిడ్డే సీఎం

బీసీ ఆత్మగౌరవ సభలో డా. లక్ష్మణ్



సూరారం రాంలీలా మైదానంలో బీజేజీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ ఆత్మగౌరవ సభకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన నయా నిజాం కేసీఆర్ నిరంకుశ పాలనకు ఈ నెల 30వ తేదీన ముగింపు పలుకుదాన్నారు. బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ కుటుంబ సభ్యుడు ముఖ్యమంత్రి అవుతారన్నారు. అదే బీజేపీ గెలిస్తే బీసీ బిడ్డ సీఎం అవుతాడన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీశైలంగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు.. నిరుద్యోగులకు న్యాయం చేస్తాం

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోకు హాజరైన జనం



రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైన కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అధికార బీఆర్ఎస్ పార్టీకి నిద్ర లేకుండా చేస్తున్నాయని.. సీఎం కేసీఆర్ ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా రాష్ట్ర ప్రజలు నమ్మేస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. గురువారం గాజులరామారం చిత్తారమ్మ అమ్మ అమ్మవారిని దర్శించుకున్న హన్మంతరెడ్డి అక్కడ నుండి ఇందిరానగర్, చంద్రగిరినగర్‌లలో రోడ్‌షోలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలతో పాటు నిరుద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని హన్మంతరెడ్డి కోరారు. శ్రీనివాస నగర్ చౌరస్తా మీదుగా మీసేవా, శ్రీరామ్ నగర్ చౌరస్తా నుంచి సుభాష్ చంద్రబోస్‌నగర్ గుండా రోడా మేస్త్రీనగర్ మీదుగా కొనసాగిన రోడ్‌షో అక్ష మసీద్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న రెడ్డి, నాయకులు సంజీవ్ రెడ్డి, జహంగీర్ భాయ్, ఎండీ లాయక్, శ్రీధర్ వర్మ, బోయిని వెంకట్, సంపత్ సింగ్, మహమ్మద్ గఫ్ఫార్, రహీమ్, కలీమ్, షేక్ మెహబూబ్, మహ్మద్ అహ్మద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన నందుగౌడ్ ఆధ్వర్యంలో శ్రీనివాసనాయక్, సునీల్, ఆనందం, అజయ్‌గౌడ్ వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరగా కొలన్ హన్మంతరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ చింతల్ డివిజన్ స్టార్ లైట్ అపార్ట్‌మెంట్స్‌లో ఎన్నికల ప్రచారం చేసిన కొలన్ హన్మంతరెడ్డి తనను గెలిపించాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆళ్ల ప్రకాష్, ప్రవీణ్, పండరి, నాగరాజు, యూసుఫ్, మహమ్మద్ మెయిన్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ కొలన్ హన్మంత్‌కి మద్దతుగా సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లో యూత్ కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీ నిర్వహించింది. అనంతరం ఏర్పాటు జూలకంటి లక్ష్మారెడ్డి, అబ్బూరి సాయి, బబ్బూరి ప్రసాద్, నాగరాజు దురిసెల, మహేష్ నందిరెడ్డి, మురళీకృష్ణ, మొక్కపాటి మహేష్ పులివర్తి, రాజేంద్ర రామారావు, ఎం.కిరణ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌కు చెందిన నందుగౌడ్ అధ్వర్యంలో చేరిన పలువురికి పార్టీ కండువాలు కప్పిన కొలన్ హన్మంతరెడ్డి



ప్రగతినగర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్, టీడీపీ నాయకులు